# ఈ సమాజం చిగిర్చేదెప్పుడు ?

బాధగా కళ్ళు మూసుకుంది శారద. ఆమె కళ్ళనుంచి రెండు వెచ్చని కన్నీటి బిందువులు ఉబికి, చెక్కిళ్ళమీదికి జారాయి.

రాత్రి జరిగిన సంఘటనే మనసును మళ్ళీ మళ్ళీ కలతపరుస్తున్నది. అనుకుంటే ఒళ్ళంతా కంపర మెత్తుతూంది.

రాత్రి పొద్దు పోయాక — తలుపు తడితే పక్క టౌనుకెళ్ళిన విష్ణు వచ్చాడేమోనని గడియ తీసింది ఆ గ్రామ సర్పంచ్ కుమారుడు రాజా నవ్వుతూ లోపలికి తోసుకు వచ్చాడు. అర్థమయింది, పరిచయంలేని అత నెందుకొచ్చాడో? ఊరుగాని ఊరు. ఉద్యోగ రీత్యా ఆ వూరు రావటం జరిగింది, అబలగా భయం వేసింది. ఆదిశక్తిగా ధైర్యం తెచ్చుకుంది. ఒడిసి పట్టుకున్నాడు, విదిలించి కొట్టింది. మర్యాదగా బయటకు నడవ మంది, వెళ్ళలేదు సరికదా, మదంపట్టిన పశువులా పైకి ఉరికాడు చేతిని కరిచి, తప్పుకొని, దగ్గర్లో వున్న కత్తిపీట అందుకుని మీదకు విసిరింది. చెయ్యి అడ్డం పెట్టాడు, తెగింది. చేతిమీద గాయమయి రక్తం కారింది. దెబ్బతిన్న పులిలా చూశాడు.

ఈ ఊరికి రాగానే చూశాడట తన అందాన్ని, తన సౌందర్యానికి సమ్మోహితుడయ్యాడట. ఆ ఊర్లో తన కన్నుపడి, తప్పించుకున్న వారెవ్వరూ లేరట. తన పంజాలోనించి తప్పుకునేందుకు ఆ దేవుని తరం కూడా కాదట. మర్యాదగా లొంగిపొమ్మని ఏవేవో కూశాడు. బూతులు జారాడు. సారాయి వాసన గుప్పుగుప్పు మంటున్నది. సమయానికి సాయి రావటంతో సరిపోయింది. లేకపోతే? ఓహ్! సాయి పాదాలమీద పడి భో న ఏడ్చింది రాత్రంతా ఏడుపే. పాపం సాయి ఓదార్చుతూ రాత్రంతా తనతోటే గడిపాడు.

రాత్రి లాస్ట్ బస్సు తప్పిపోవటాన, ఉదయం ఫస్ట్ బస్సుకే వచ్చే శాడు విష్ణు. రాగానే విష్ణు విశాలవక్షంలో తలదాచుకొని వెక్కివెక్కి ఏడ్చింది అంతా విన్న విష్ణు సర్పంచ్ ఇంటికి వెళ్ళాడు న్యాయంకోసం. తను వద్దన్నా వినిపించుకోలేదు. "మనం పేదవాళ్ళం కడుపు చేత్తో పట్టు కొని ఉద్యోగ రీత్యా ఇంత దూరం వచ్చాం. ఈ గ్రామ ప్రజలకు నాయకుడు సర్పంచ్. తన కొడుకు అంతటి ఘోరం చేస్తుంటే సహిస్తాడా? సమర్ధిస్తాడా? ఊరుకుంటే లాభం లేదు. రేపుని గూర్చి జాగ్రత్త పడాలి. జాగ్రత్తపడాలి" ఉద్వేగంగా అనుకుంటూ వెళ్ళాడు. న్యాయం జరుగు తుందా?

* * *

విష్ణు బ్రాహ్మణ యువకుడు, శారద హరిజన యువతి. వాళ్ళు ఈతరం మనుషులు ఇద్దరిది ఒకే ఊరు ఇద్దరూ హైస్కూలువరకు చదువుకున్నారు. సాహిత్యమంటే అభిరుచి ఎక్కువ ఇద్దరికీ, సాహిత్యం మనిషిలో మానవత్వాన్ని నింపుతుంది, నిలుపుతుంది– అనేందుకు వారిద్దరే ప్రత్యక్ష సాక్ష్యాలు.

విష్ణు ఊరిలోవున్నా. శారదా ఊరికి కొంచెం దూరంలోవున్న మాల పల్లెలోవున్నా. వాళ్ళిద్దరినీ కలిపింది మంచి మంచి పుస్తకాలే! ఊరికీ, మాలపల్లెకూ మధ్యలోవున్న విశాలమైన తోటలు, పచ్చని పొలాలు వారిని ఆశీర్వదించాయి ఒకరి నొకరు అర్థం చేసుకొన్నారు.

అతి కష్టంమీద విష్ణుకు ఎలెక్ట్రిసిటి డిపార్టుమెంట్‌లో హెల్పర్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం రాగానే తిరుపతి వెళ్ళి వివాహం చేసుకొని వచ్చారు. సంస్కారులు వారిని అభినందించారు. సమాజం వాళ్ళను పురుగుల్లా చూడసాగింది. ఉక్కు ముక్కలతో పొడవసాగింది. కొన్నాళ్ళు ఎన్నో కష్టనిష్ఠూరాలకు, కలతలకు తల ఒగ్గవలసి వచ్చింది. అన్నీ ముందే ఊహించుకొన్నవి కావటాన నిశ్చింతగా కాలం గడిపారు. చివరికి అనుకోకుండా విష్ణుకు దూరాన మరో పల్లెటూరికి ట్రాన్స్‌ఫర్ అయింది.

గర్భవతి అయిన ఇల్లాలితో ఆ పల్లెటూరికి పయనం కట్టాడు విష్ణు. ఆ ఊరికి వెళ్ళగానే ఆడపిల్లను ప్రసవించింది శారద. అక్కడ వారిని అర్థం చేసుకొని, దగ్గర చేరినవాడు సాయి. సాయి తల్లిలేని ఒక హరిజన పేద విద్యార్థి. మంచిగా, మమతగా వాళ్ళను పలకరించేది, పరామర్శించేది ఆ అబ్బాయే! మిగతా అందరూ విచిత్రంగా చూస్తూ, దూరంగా మాట్లాడుతూ వుంటారు. వారి మాటలలో, చేతలలో, చూపులలో 'వెలి' స్ఫురిస్తుంది. బాపూ కలలు కన్న పల్లెటూళ్ళు ఇవేనా—అనిపిస్తుంది. ఇవేనా?

"వదినా!"

ఆ ఊరిలో అలా శారదను పిలిచేది సాయి ఒక్కడే. అప్పుని చూడగానే ఆమె కళ్ళలో నీటి ధార ఆగలేదు

"వదినా! మీరింకా...."

"సాయీ! విష్ణు వద్దన్నా వినకుండా సర్పంచ్ ఇంటికి వెళ్ళాడు"

"అక్కడున్నవన్నీ మృగాలే. వాటికి కావలసింది రక్త మాంసాలే మనిషి మనసులు కావు. అక్కడ మనకు న్యాయం జరుగుతుందని నేననుకోవటం లేదు. వదినా! మనమేం ఎక్కువగా మాట్లాడినా మనపై మరింత కసి, పగ పెంచుకుంటారు వాళ్ళు. మనుషులను ప్రేమించటం వాళ్ళకు తెలియదు, వదినా. పెరుక్కు తినటం తెలుసు?"

"సాయీ!"

"భయపడకు వదినా! అన్నీ తెలిసిన మీరే ఇలా దిగాలు పడితే ఎలా? ఆ కుటుంబానికి ఈ ఊళ్ళో ఎదురు నిలిచే శక్తి ఎవరికీ లేదు కాదు, ఆ స్థాయికి ఎవరినీ ఎదగకుండా అణగ తొక్కింది ఆ కుటుంబం, ఫరవాలేదు. కొత్త రోజులు వచ్చాయి ఉషోదయంకోసం ఎదురు చూద్దాము" సాయి కళ్ళలో-ఎన్నో ఆశలు ప్రతిఫలించాయి. ఎంతో విశ్వాసం అతనిలో బుసకొట్టింది.

"సాయీ! జ్యోత్స్న నీకు తెలుసా?"

ఎదురు చూడని ఆ ప్రశ్న కదిలించింది సాయిని.

"జోత్స్నాదేవి? సర్పంచ్‌గారి అమ్మాయి! ఆఁ.... ఒకరోజు సంధ్యలో వాళ్ళ సరగుడు తోటలో "గీతాంజలి" చదువుతూ కూర్చుని వున్నాను. అనుకోకుండా అక్కడ కలిసింది. ఎన్నో విషయాలు అడిగింది. చాలాసేపు మాట్లాడుకున్నాం. పుస్తకాలంటే ఎంత ఇష్టమో నేనంటే కూడా అంత ఇష్టమట. చెబుతూవుంది ఇంతలో వాళ్ళన్నయ్య రాజా వచ్చి అరిచాడు, వెళ్ళిపోయింది. నన్ను తోటలోంచి గెంటించాడు. అంతే! ఇంతవరకూ ఆమెను మళ్ళీ చూడలేదు. ఎందుకు వదినా అలా అడిగారు?"

"ఓ రోజున బస్సు దిగి వెళుతూ కాబోలు ఇక్కడకు వచ్చి వెళ్ళిందిలే! చాలా మంచి పిల్ల"

ఇంతలో విష్ణు వచ్చాడు.

"సాయీ! మీ నాన్నగారు నిన్ను వెంటనే ఇంటికి రమ్మన్నారు."

విష్ణు మాటతో సాయి వెళ్ళిపోయాడు.

*          *          *

"ఏం జరిగిందండీ?"

శారద ప్రశ్నకు చీకాకు పడ్డాడు విష్ణు. "వాళ్ళు మనుషులు కాదు. సభ్యతాలేదు, సంస్కారమూ లేదు. ఛీఛీ! ఇలాంటి వాళ్ళను పాలకులుగా ఎలా ఎన్నుకుంటారో ఈ ప్రజలు?"

"ఇంతకూ ఏమయింది?"

"వాళ్ళబ్బాయిదేమీ తప్పులేదట. వయస్సులో వున్న ప్రతి కుర్రాడూ చేసేదే తన కుమారుడూ చేశాడట. నిన్ను నాతో లేవదీసుకొచ్చి పెళ్ళి చేసుకున్నానట. నీ కులం, నా కులం వాళ్ళకు బాగా తెలుసట. పైగా నీకూ, సాయికీ అక్రమ సంబంధం ఉందట. అలాంటి మన ఇంట్లోకి ఎవరు దూరినా తప్పు లేదు."

"విష్ణూ!"

"ఏం? నైష్టికుల సదాచారాలతో పునీతులైన మన సమాజంలో ఇలాటి తండ్రులున్నారని ఆశ్చర్యపోతున్నావా? శారదా! అధికారం, ధనం ఎక్కువయి వాళ్ళనలా చేస్తున్నాయి. సహించకూడని బిడ్డ తప్పును సమర్థిస్తున్న తండ్రులున్న ఈ సమాజం ఇంకెప్పుడు బాగుపడుతుందో?"

"మీరేమన్నారు" నిర్వికారంగా అడిగింది శారద

"మామూలు పేదవానిలా వాళ్ళన్నవన్నీ విని, తలవంచుకుని తిరిగి రాలేదు. నేనూ మనిషినే. నాలోనూ హృదయముంది; రక్తం ప్రవహిస్తూ వుంది, అదే చెప్పి వచ్చాను గ్రామ పాలకులైన మీరిలా మాట్లాడటం తగదు. మీకు అంతస్తు ఉండవచ్చు; అధికారం ఉండవచ్చు. అంత మాత్రాన మీ కన్నుపడ్డ నరుల భార్యలు మీకు విలాస వస్తువులు కాదు,

కాలేరు. ఆపదలోనయినా ప్రాణంకన్నా మానం విలువైనదని భావించేది మేమే మాకే అపకారం జరిగినా మీ బ్రతుకు బయడపెట్టి మీగుండెల్లో నిద్రపోతాను, జాగ్రత్త! అని హెచ్చరించి వచ్చాను. మరొక్కమాట కూడా స్పష్టం చేశాను శారదను నేను అగ్ని సాక్షిగా పెళ్ళాడాను. అలాటి ఇల్లాలిని, మా పవిత్ర ప్రేమను హేయంగా, హేళనగా మాట్లాడిన మీ కళ్ళు తెరిపిస్తాను. మేము మనుషులమనీ, మీకంటే ఉన్నతులమనీ నిరూపించే రోజు ఎంతో దూరంలేదు ఆరోజు కోసం ఎదురు చూస్తాను. —అని చెప్పి మరీ వచ్చాను," దృఢంగా ఉన్నాయి ఆ పలుకులు.

"విష్ణూ!" విష్ణు గుండెమీద భారంగా వాలిపోయింది శారద ఆమెను ఓదార్పుగా తన బాహూవుల్లోనికి తీసుకున్నాడు విష్ణు.

"నాకు ఎందుకో భయం వేస్తోంది విష్ణూ! మన ఊర్లో కాకుల్లా పొడిస్తే ఇక్కడికొచ్చాము. ఇక్కడా ప్రశాంతి కరువయింది. మనం మరో ఊరికి వెళ్ళిపోదాం. ట్రాన్స్‌ఫర్‌కోసం ప్రయత్నించు" అన్నది శారద కంట నీరు కుక్కుకుంటూ.

"ఎక్కడికెళ్ళినా సమాజంలోనే బ్రతకాలి. అక్కడ మాత్రం ఇలాంటివారు లేరని ఏమిటి నమ్మకం? భయపడి పారిపోయేకొద్దీ మరీ తరుముతారు. ప్చ్! మనం వెళతాం. మరో మనలాటి కుటుంబమే ఇక్కడికి రావాలిగా? వారికైనా ఇదే గతి. ఈ ఘోర కలి ఇలా సాగిపోవల సిందేనా??"

సాయి వచ్చాడు మెల్లగా.

శారద విష్ణు బాహువులలోంచి విడివడ్డది.

"ఏం సాయి? నాన్నగారిని కలిసి వచ్చావా?" విష్ణు అడిగాడు.

"ఆఁ.... ఆ సర్పంచ్, అతని అనుచరవర్గం నన్ను హాస్టల్‌నుంచి తీసి వేయించారు. నాన్నను పిలిపించి ఘోరంగా తిట్టారట." తల వంచుకుని చెప్పాడు సాయి.

"నువ్వు ఏం తప్పు చేశావో వెళ్ళి అడుగుదాం, పద ఆపైన ప్రభుత్వానికి తెలియపరచుకుందాం." ఆవేశంగా ముందడుగు వేశాడు విష్ణు.

"నేనే వెళ్ళి అడిగాను."

"ఏమన్నారు?"

"నేను చెడిపోయానట— అని వార్డెన్ రిపోర్ట్ అన్నాడు. కమిటీ ఈ నిర్ణయం చేసిందట. నేను....నేను...."

సాయి గొంతు ఆర్ద్రమయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సాయీ! నువ్వు ఇంక మా ఇంటికి రావటం మానెయ్యి,'

"వదినా?!"

"అవును. నీ మంచికే చెబుతున్నాను."

"వదినా? మీరేనా ఇలా మాట్లాడేది?"

విష్ణు అందుకున్నాడు.

"సాయీ! నువ్వు మామూలుగా మా ఇంటికి రావచ్చు. అంతేకాదు, ఇకమీదట భోజనం కూడా ఇక్కడే చెయ్యొచ్చు."

"విష్ణూ!"

"లేకపోతే ఏమిటి శారదా, సాయి ఏం తప్పుచేశాడని ఈ శిక్ష? ఎవరో ఏమో అన్నారని మనం కూడా ఆ పసివాణ్ణి అలా బాధించటం భావ్యమా?"

సాయి సజల నయనాలతో వంగి విష్ణు పాదాలకు నమస్కరించాడు. శారద కళ్ళు అతనిపై ప్రేమ వర్షాన్ని కురిపించాయి.

* * *

ఆ వేళ ఆ ఊరికి మంత్రివర్యులు వస్తున్నట్లు తెలిసి ప్రజలు చాలా హడావుడి పడుతున్నారు. పక్క టౌన్‌కు ఏదో ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిగారు ఆ ఊరి సర్పంచ్ బహు దూరపు బంధువు కావటాన, అతని ఆహ్వానాన్ని మన్నించి అక్కడికి వస్తున్నారట! ఏర్పాట్లు పెద్ద ఎత్తునే జరుగుతున్నాయి.

విష్ణు మాత్రం తన కుటీరంలోనే వున్నాడు. కళ్ళు తెరిచి ఈ లోకాకాన్ని, ఈ సమాజాన్ని చూసేందుకు ఇప్పుడిప్పుడే ఇష్టపడక ఎక్కువ కాలం నిద్రలో గడుపుతూవున్న తన పాపను తదేకంగా చూడసాగాడు విష్ణు. శారద వంటపని చూస్తూ ఉంది.

ఇంతలో సర్పంచ్ నౌకరు వచ్చాడు.

"అయ్యగారు నిన్ను నిలువనా తీసుకురమ్మన్నారు" అన్నాడు

"ఎందుకు?" విష్ణు కుటీరం వెలుపలికి వచ్చి అడిగాడు

"అడేడనో ఊరవతల అడవిలో లైను తెగిపోయిందంట. నువ్వొంట ఎల్లి బాగు సేసిరా, మంతిరీ రేయికే వస్తాడు."

లైను తెగిపోయిందని తెలియగానే విష్ణు త్వరత్వరగా బయలు దేరాడు.

"శారదా! నేనొచ్చేలోపల ప్రొద్దు పోవచ్చు. గడియ జాగ్రత్తగా వేసుకో. సాయి కూడా ఊళ్ళో లేడు. బహుశా లాస్ట్ బస్‌కు రావచ్చు. వాళ్ళింట్లో చెప్పి వెళతాను, వస్తాను."

*　　　　*　　　　*

మంత్రివర్యులు వచ్చారు.

ఊరంతా తప్ప తాగి, డప్పులు కొడుతూ ఆనందం చేసు కుంటున్నారు. అంతా కోలాహలంగా ఉంది."

లాస్ట్ బస్సు చెడిపోవటాన రాత్రి పన్నెండు గంటలకు ఆలస్యంగా వచ్చింది ఆ బస్సు. ఆ బస్సులో దిగాడు సాయి.

ఇంటికి వస్తూంటే పక్కింటి పుల్లయ్య పిలిచాడు సాయిని.

"సాయీ! ఈ గోరం విన్నావా? పాపం ఎల్ఫర్‌ను మోసం చేసి. బేవరసగా లైనెక్కించి, పనిసూత్తుంటే కరంటు ఏశారంట, ప్రెసిరెంటు గోరి మనుషులు. ఆయబ్బి అక్కడికక్కడే పాణాలిడుసుండు, అడవిలో. నాయాళ్ళు అరాజా, అడి మనుసులు బాగా తాగి ఈ విషయం గుసగుస

బాడుతూ, రాంద్రా అడి పెళ్ళాం పని పడదాం — అని సెబుకుంటూ ఆ ఎల్బర్ ఇంటిదెస ఎల్లారు. అడ గల్లాలు.... యేమయిందో యావో(? ఊళ్ళో సందడి బాగా సాకు సేసుకున్నారు. నాయాళ్ళు" అంటూ దగ్గులో మునిగాడు ఆ వృద్ధుడు.

* * *

''వదినా" పిచ్చిగా అటు పరుగెత్తాడు సాయి.

చిమ్మచీకటిగా వుంది. అప్పుడే ఎవరో మనుషులు అలికిడి పసికట్టి కామోసు, ఆ కుటీరం నుండి వెలుపలికి పోయారు. ఇంట్లో సన్నగా పసిపాప రోదన!— ఆత్రంగా, ఆదుర్దాగా ఆ కుటీరంలో అడుగు పెట్టాడు సాయి.

"వదినా!" మెల్లగా పిలిచాడు

తన పిలుపు తనకు సమాధానం అయింది.

మెల్లగా తడుముకుంటూ వెళ్ళి గూటిలో అగ్గిపెట్టె తెచ్చి, పుల్ల వెలిగించాడు.

కనిపించిన ఆ దృశ్యానికి కొయ్యబారి పోయాడు శారద ఒళ్ళంతా రక్తం. గాట్లు! జుట్టు విడిపోయి, అస్తవ్యస్తంగా వుంది. ఒక చెయ్యి గుంజకు గుడ్డతో కట్టేసి వుంది. మరో చేతిలో కొడవలి దృఢంగా వుంది. నోట్లో సగం గుడ్డ కుక్కి వుంది. ఆ క్షణమో మరో క్షణమో స్పృహతప్పేలా వుంది.

సాయిని ఆ వెలుగులో చూసింది శారద. అంతే! క్రిందకు తూలి పోబోయింది,

పరుగున వెళ్ళి కట్లు విప్పాడు, నోట్లో గుడ్డ తీశాడు. ఆ పక్కనే వున్న బిందెలో నీళ్ళు ఆమె ముఖాన చిలకరించి, ఆమె శిరస్సును తన ఒడిలోకి తీసుకున్నాడు సాయి.

"వదినా! వదినా!?.... నేను.... నేను.... సాయిని, సాయిని వదినా!!" కన్నీళ్ళు సాయి చెక్కిళ్ళను తడిపేశాయి.

శారద కాస్త స్పృహ తెచ్చుకున్నట్లు కదిలింది.

''సాయీ!.... సాయీ! నాకేం కాలేదు. నువ్వు....నువ్వు వచ్చేశావుగా, సాయీ! సాయీ! రెండుసార్లు నాశీలాన్ని, రక్షించావు నువు. నా పాలిటి.... దేవుడివి."

"వదినా!"

"సాయీ! ఆ దుర్మార్గులు ఎంతో హింస పెట్టారు నేను ... లొంగలేదు.... నా శక్తి కొద్దీ పోరాడాను. కానీ.... కానీ.... ఎంత సేపని? బాగా అలిసిపోయాను. ఇంతలో....ఇంతలో.... ఈ కొడవలి చేతికి అందింది,—మళ్ళీ తిరగబడ్డాను. అంతలో—నువ్వు నువ్వు— దేవుడిలా వచ్చావు సాయీ! నీ ఋణం తీర్చుకోలేను. విష్ణుతో చెప్పు నా శీలాన్ని కాపాడింది నువ్వని. పవిత్రంగానే నేను—నేను—సాయీ! పాప—సాయీ!! ఊఁ పాపం-జ్యోత్స్నను క్షమించగలవా?" అంతే, తల వాల్చేసింది శారద. ఆమె ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

అప్పటికే ఆ కుటీరానికి నిప్పంటించి పారిపోయారు, దుండగులు. మంటలు నాలుగు వైపులా నాలుకలు చాపుతున్నాయి. దిగ్గున లేచాడు. సాయి పాపను అందుకుని బయటపడ్డాడు.

ఊరి నడిబొడ్డున ఆనందోత్సాహాలు ఆకాశాన్నంటుతున్నాయి.

కన్నీళ్ళు ధారగా స్రవిస్తూవుంటే, పాపను భుజంపై పడుకోబెట్టుకొని, అల్లంత దూరాన నిలిచి ఆ మంటల్లోకి ఆవేదనగా చూడసాగాడు సాయి.

మరో భుజం మీద మృదువైన చెయ్యి పడింది.

తిరిగి చూశాడు,, ఆ మంటల వెలుగులో.

"జ్యోత్స్నాదేవీ?"

"వెళదాం, పదండి!"

"ఎక్కడికి?"

"అంధకారంలోంచి అనంతమైన వెలుగులోకి. ఈ క్షణం నుంచి నేను మీ ధర్మపత్నిని. పగయినా, ప్రేమయినా మీతో సమానంగా పంచుకుంటాను." సాయి భుజం మీది పాపను అందుకుని, రోడ్డుకేసి ముందుకు అడుగులు వేసింది జ్యోత్స్నాదేవి.

సాయి కదలలేదు. ఆలోచిస్తున్నాడు.

"పాపం— జ్యోత్స్నను- క్షమించగలవా?" శారద చివరి మాటలు మదిలో మెదిలాయి.

అడుగులు ముందుకు వేశాడు.

*

**END**